

*'19వ శతాబ్దం సామ్రాజ్యాల శతాబ్దం. 20వ శతాబ్దం దేశాల శతాబ్దం, 21వ శతాబ్దం నగరాల శతాబ్దం'*

– భారత రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ, హైదరాబాద్‌లో జరిగిన మెట్రోపొలిస్ సదస్సు ముగింపు సభ సందర్భంగా..

*'మానవుడు నగర జీవిగా మారుతున్నాడు'*

– 2008లో ఐక్యరాజ్య సమితి నివేదిక

# నగరీకరణ... నవీన పరిష్కారాలు

**2050 నాటికి ప్రపంచంలోని మూడింట నాలుగొంతుల జనాభా పట్టణాలు, నగరాల్లోనే జీవిస్తుంది. ఈ నగర జనాభా ప్రధానంగా ఆసియా, ఆఫ్రికా దేశాల్లో పెరుగుతున్న నగరాల నుంచే వస్తుంది.**

- 2001 జనాభా లెక్కల ప్రకారం భారతదేశ జనాభాలో 28.81 శాతం నగరాలు, పట్టణాల్లో నివసించేవారు. అంటే దేశ జనాభాలో సుమారు 28.5 కోట్ల మంది పట్టణాల్లోనే జీవించేవారు. ఇది 2011 నాటికి 37.7 కోట్లకు పెరిగింది. దేశ జనాభాలో 31.16 శాతం నగరాలు, పట్టణాల్లో నివసిస్తున్నారు. అయితే భారతదేశంలో కూడా నగరీకరణ ప్రక్రియ వేగంగా సాగనుంది. 2040 నాటికి భారతదేశ జనాభా 140 కోట్లకు చేరుతుందని, అప్పుడు సుమారు 60 కోట్ల మంది నగరవాసులేనని అంచనా. అంటే దేశ జనాభాలో 40 శాతానికి పైగా పట్టణాలు, నగరాల్లోనే ఉండబోతోంది.
- అనేక ఆవిర్భవిస్తున్న దేశాలతో పోలిస్తే భారతదేశంలో నగరీకరణ తక్కువేనని గణాంకాలు పేర్కొంటున్నాయి. చైనా జనాభాలో 45 శాతం, ఇండోనేషియా జనాభాలో 54 శాతం, మెక్సికో జనాభాలో 78 శాతం, బ్రెజిల్ జనాభాలో 87 శాతం నగరాలు, పట్టణాల్లోనే జీవిస్తున్నారు.
- 2011 జనాభా లెక్కల ప్రకారం దేశంలో జనాభా వృద్ధిరేటు 2.76 శాతం. దేశంలోని నగర జనాభా కూడా మహానగరాల్లో అధికం. ఉదాహరణకు, దేశంలో పది లక్షల జనాభా ఉన్న నగరాల సంఖ్య 2001లో 35. ఇది 2011లో 52కు పెరిగింది.
- నగరాలు ఆర్థికాభివృద్ధికి కేంద్రాలుగా మారుతున్నాయి. భారతదేశ స్థూల దేశీయోత్పత్తిలో 60 శాతం నగరాల నుంచే వస్తోంది. దేశం మొత్తం మీద 100 ప్రధాన నగరాల్లో కలిపి దేశ జనాభాలో 16 శాతం నివసిస్తున్నారు. కానీ, వీటి మొత్తం భూవైశాల్యం దేశ మొత్తం విస్తీర్ణంలో కేవలం 0.24 శాతమే. ఈ 100 నగరాల నుంచే భారతదేశ మొత్తం స్థూల దేశీయోత్పత్తిలో 43 శాతం లభిస్తోంది. ప్రపంచ జనాభాలో 50 శాతానికి పైగా నగరాల్లోనే నివసిస్తున్నారు. దీన్నిబట్టి భారతదేశంలో నగరీకరణకున్న అవకాశాలను అర్థం చేసుకోవచ్చు.

### సవాళ్లు.. సమస్యలు..

- నగరాలు శరవేగంగా విస్తరిస్తున్న తరుణంలో కాలుష్యం, పారిశుద్ధ్యం, రవాణా, పౌరసేవలు, భద్రత లాంటి అంశాలు సమస్యాత్మకంగా పరిణమిస్తున్నాయి. ఈ సమస్యలకు సృజనాత్మక, నవీన పరిష్కారాలను కనిపెట్టాలి.

## జనరల్ స్టడీస్

అభివృద్ధి చెందుతున్న దేశాల్లో చాలావరకు నగరీకరణ సవాలును సమర్థంగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా లేవు. ముఖ్యంగా పౌర సేవలు, సదుపాయాల కల్పనలో ప్రజలందరికీ సమాన అవకాశాలు కల్పించే విషయంలో లోపం సుస్పష్టం. అందుకే హైదరాబాద్ మెట్రోపొలిస్ సదస్సు 'అందరికీ నగరాలు' అనే పిలుపునిచ్చింది.

- పెరుగుతున్న ప్రజల అవసరాలను తీర్చేందుకు, నగరీకరణ తెస్తున్న సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు నగర పాలనా వ్యవస్థలను పటిష్ఠం చేయాలి. అవసరమైన నిధులను సమీకరించుకోగలగాలి.



ప్రొఫెసర్ కె. నాగేశ్వర్

- నగరాలను జీవనయోగ్యంగా మార్చుకోవడంలో పలు సవాళ్లు ఎదురవుతున్నాయి. వీటిలో ప్రధానమైంది- వాతావరణ మార్పు. ప్రజలందరికీ కనీస అవసరాలైన మంచినీరు, రవాణా, వ్యర్థపదార్థాల యాజమాన్యం, భూమి, ఇంధనం, హరిత భవనాల నిర్మాణం మొదలైనవి అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలి.
- నిధుల సమీకరణ నగరాలకు మరో పెద్ద సవాలు. ప్రజలకు మౌలిక వసతుల కల్పన, ప్రాథమిక సేవలను అందించడంలో నేటికీ వెనుకబాటుతనం కనిపిస్తోంది. పట్టణ భారతదేశంలో తొమ్మిది శాతం ప్రజానీకానికి సురక్షిత మంచినీటి సదుపాయం లేదు. 12.6 శాతం పట్టణ జనాభాకు మరుగుదొడ్ల సదుపాయం లేదని రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ పేర్కొన్నారు. హైదరాబాద్‌లో జరిగిన మెట్రోపొలిస్ ముగింపు సదస్సులో ఆయన ఈ విషయాలను ప్రస్తావించారు.

### వ్యర్థపదార్థాల నిర్వహణ..

- నగరాలు, పట్టణాల్లో వ్యర్థ పదార్థాల యాజమాన్యం ప్రధాన సవాలుగా మారుతోంది. ఈ విషయంలో ప్రస్తుత ఆలోచనా దృక్పథం సమూలంగా మారాల్సి ఉంది. వ్యర్థ పదార్థాలను సరైన పద్ధతిలో ప్రాసెసింగ్, రీసైక్లింగ్ చేయడంపై దృష్టి సారించాలి. ఇందులో సగటు పౌరుడి నుంచి ఉన్నత స్థాయి పాలనా యంత్రాంగం వరకూ అందరినీ భాగస్వాములుగా చేయాలి.
- వ్యర్థ పదార్థాల నుంచి విద్యుత్, ఎరువులు మొదలైనవి తయారుచేసే సాంకేతిక ప్రక్రియలు ప్రపంచమంతటా వ్యాప్తిలో ఉన్నాయి. వ్యర్థ పదార్థాలను సమస్యగా కాకుండా వనరుగా గుర్తించాలి.
- కేంద్ర ప్రభుత్వం 'స్వచ్ఛ భారత్ అభియాన్' పేరిట దేశవ్యాప్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 2019లో జాతిపిత మహాత్మాగాంధీ 150వ జయంతి వేడుకలను జరుపుకోబోతున్నాం. అప్పటికల్లా దేశంలోని మొత్తం 4041 మున్సిపల్ పట్టణాలను పరిశుభ్రంగా మార్చాలన్నది ఈ కార్యక్రమం నిర్దేశించుకున్న బృహత్తర లక్ష్యం.
- కాలుష్యం నగరాలను వణికిస్తోంది. అందుకే నియంత్రణ కంటే నివారణ చర్యలపై శ్రద్ధ వహించాలి. నగరాల్లో హరిత వనాలు, ప్రదేశాలను అభివృద్ధి చేయాలి. ప్రజలు స్వచ్ఛమైన గాలి పీల్చుకునేందుకు పార్కుల లాంటి సదుపాయాలను కల్పించాలి. ఇంధనాన్ని తక్కువగా వినియోగించే పరికరాలు, ప్రక్రియలపై దృష్టి పెట్టాలి.
- మన నగరాల్లో 'హరిత లోటు' తీవ్రస్థాయిలో ఉంది. అందుకే పట్టణాభివృద్ధి ప్రణాళికలను హరిత దృక్పథంతో రూపొందించాలి. హరిత భవనాల నిర్మాణాన్ని ప్రోత్సహించాలి. గాలి, వెలుతురు బాగా ప్రసరించేందుకు అవకాశం ఉన్న రీతిలో భవన, పట్టణ నిర్మాణాలు జరగాలి.

### మెరుగైన పౌరసేవలు..

- జనాభా పెరిగే కొద్దీ పాలనా వ్యవస్థలపై బాధ్యతల భారం పెరుగుతోంది. మెరుగైన పౌరసేవల నిర్వహణలో సాంకేతిక పరిజ్ఞాన విస్తృత వినియోగం అనేది నేడు అంతర్జాతీయంగా కనిపిస్తోన్న ధోరణి. భారతీయ నగరాల్లోనూ ఎలక్ట్రానిక్ గవర్నెన్స్ పద్ధతి ప్రవేశ పెడుతున్నారు.
- ప్రభుత్వం, పట్టణ పాలనా యంత్రాంగం పౌరులకు సేవలు అందించే ప్రక్రియలో సాంకేతిక పరిజ్ఞానాన్ని విరివిగా ఉపయోగించాలి. దానివల్ల పాలనా సామర్థ్యం పెరుగుతుంది. తక్కువ యంత్రాంగంతో అధిక ఫలితాలు సాధించవచ్చు. అవినీతిని, జాప్యాన్ని గణనీయంగా తగ్గించవచ్చు. పాలనలో పారదర్శకత పెరుగుతుంది.
- నగరాల్లో ఇంటర్నెట్ వినియోగం పెరుగుతోంది. బ్రాడ్‌బ్యాండ్ సదుపాయాలు విస్తరిస్తున్నాయి. నగరమంతా వైఫై జోన్లుగా మార్చే దిశగా స్మార్ట్ నగరాల రూపకల్పన సాగాలి. దీంతో పాలనా వ్యవస్థ ఉత్పాదకత గణనీయంగా పెరుగుతుంది.

### గృహ వసతి..

- నగరాల్లో అధిక జనసాంద్రత, వలసలు పెరగడం, స్థిరాస్తి విలువలు గణనీయంగా పెరగడంతో సామాన్యుడికి గృహవసతి లభించడం సమస్యగా మారింది. వివిధ వర్గాల ప్రజలకు గృహవసతిని అందుబాటులోకి తేవడంలో ప్రభుత్వ, ప్రయివేటు భాగస్వామ్యం కీలకం.
- పెరుగుతున్న గృహ అవసరాల సమస్యను అధిగమించేందుకు ఉపగ్రహ పట్టణాలను అభివృద్ధి చేయాలి. మహానగరాల చుట్టూ చిన్న చిన్న పట్టణ ఆవాసాలను వృద్ధి చేయాలి.
- నగరాలు విస్తరించే కొద్దీ సామాజిక జీవనంలో మార్పు వస్తుంది. నగరాలు, పట్టణాల్లో అన్ని రకాల ప్రజలకు భద్రత కల్పించడం పెద్ద సవాలుగా పరిణమిస్తోంది. తీవ్రవాదం, సంఘటిత నేరాలు, మహిళల భద్రత లాంటివి ఇందులో కీలకమైనవి.
- స్మార్ట్ సిటీలు శాంతిభద్రతలతో కూడినవై ఉండాలి. పట్టణాభివృద్ధిని సమాచార, సాంకేతిక పరిజ్ఞాన వినియోగం, పర్యావరణ పరిరక్షణ, మౌలిక వసతుల కల్పన, మెరుగైన పౌరసేవల లభ్యత, సమర్థవంతమైన నగర పాలన లాంటి విభిన్న అంశాలతో సమీకృతం చేయడమే స్మార్ట్ సిటీ ముఖ్య ఉద్దేశం.

(రచయిత ఉస్మానియా విశ్వవిద్యాలయం జర్నలిజం అధ్యాపకులు, శాసనమండలి సభ్యులు)

## స్మార్ట్ సిటీలు...



కేంద్ర ప్రభుత్వం దేశం మొత్తం మీద వంద స్మార్ట్ సిటీల నిర్మాణాన్ని చేపట్టాలని నిర్ణయించింది. భారతీయ నగరాలను స్మార్ట్ సిటీలుగా రూపొందించే ప్రక్రియకు సహకరించడానికి అమెరికా, జపాన్ లాంటి దేశాలు కూడా ముందుకు వచ్చాయి.

- స్మార్ట్ సిటీలకు ఉండాల్సిన మొదటి లక్షణం- పరిశుభ్రత. అత్యాధునిక పారిశుద్ధ్య వ్యవస్థ, వ్యర్థ పదార్థాల నిర్వహణలో సమర్థంగా వ్యవహరించడం స్మార్ట్ సిటీకి తప్పనిసరి. దీంతోపాటు నగరాలు, పట్టణాల్లో చౌకగా అందుబాటులో ఉండే విస్తృత ప్రజా రవాణా వ్యవస్థలను అభివృద్ధి చేయాలి. దీనివల్ల ఏకకాలంలో అనేక ప్రయోజనాలు పొందవచ్చు.
- రోజురోజుకూ నగరాల్లో క్లిష్టంగా మారుతున్న ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం కనిపెట్టవచ్చు. కాలుష్యాన్ని నివారించవచ్చు. వాతావరణ మార్పుతో తలెత్తుతున్న ప్రమాదాలను నివారించవచ్చు. రోడ్లపై వత్తిడి తగ్గించి, నాణ్యతను పరిరక్షించవచ్చు.
- స్మార్ట్ సిటీల్లో స్మార్ట్ రవాణా వ్యవస్థ కీలకం. సమర్థమైన రవాణా వ్యవస్థ నిర్మాణంతో ప్రజల్లో ప్రజారవాణా వ్యవస్థపై విశ్వాసాన్ని పెంచవచ్చు. ప్రయివేటు వాహనాల వినియోగాన్ని గణనీయంగా తగ్గించగలిగితే విదేశీ మారకద్రవ్యం కూడా ఆదా అవుతుంది. వివిధ రకాల రవాణా వ్యవస్థల మధ్య సమన్వయం అవసరం.
- మున్సిపాలిటీలు ప్రజారవాణాను తమ బాధ్యతగా భావించడం లేదు. నగర పాలనా వ్యవస్థలో ప్రజారవాణాకు కీలక ప్రాధాన్యం దక్కాలి. రవాణాను అభివృద్ధి అంశంగా గుర్తించాలి. పట్టణాలు, నగరాల ప్రణాళికల్లో ప్రజారవాణాకు పెద్దపీట వేయాలి.